## ఎర్రవల్లిలో క్రీడాకారుల సందడి

ఆర్ అండ్ ఆర్ కాలనీ ఎర్రవల్లి గ్రామంలో అంబేద్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కబడ్డీ చాంపియన్షిప్ ట్రోఫీ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి,కబడ్డీ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి పోటీలను ప్రారంభించారు.ఈ పోటీలకు జిల్లాలోని 26 మండలాల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. దీంతో అక్కడ క్రీడాకారులతో సందడి కనిపించింది. పోటీలను తిలకించేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

- శెనార్తి మీడియా, గజ్వేల్



## కాళేశ్వరం అడవుల్లో మంటలు

- వంటలు చేసుకోవడంతోనే వ్యాప్తి
- వేలాది మొక్కలు మంటలకు ఆహుతి

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

కాళేశ్వరం ప్రాంతంలో కార్చిచ్చు మంటలు అదుపుతప్పి అడవిని కబళిస్తున్న ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మండలంలోని అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న నీలగిరి చెట్ల ప్లాంటేషన్‌లో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఈ అగ్ని ప్రమాదంలో వేలాది మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి. దవానలం వ్యాప్తి కారణంగా దట్టమైన పొగ ప్రాంతమంతా కమ్మేసింది. మంటలు వ్యాపించడంతో స్థానిక గ్రామాల ప్రజలు భయంతో ఇళ్లను విడిచిపెట్టి సురక్షిత ప్రాంతాలకు తరలి పోతున్నారు. పలువురు స్థానికులు బకెట్లతో నీళ్లు చల్లి మంటలను అదుపు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే మంటలు తీవ్రంగా వ్యాపించడంతో వాటిని అదుపు చేయడం కష్టతరంగా మారింది.అగ్ని ప్రమాదానికి కారణంగా పర్యావరణానికి తీవ్రమైన నష్టం వాటిల్లుతోందని వనవిభాగ అధికారులు పేర్కొంటున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, కాళేశ్వర ఆలయానికి వచ్చిన కొంతమంది భక్తులు వంటల కోసం మంటలు వేసి, అవి పూర్తిగా ఆర్పకుండా వెళ్లిపోయినట్లుగా అనుమానిస్తున్నా రు. దీంతో మంటలు పొలిమేరలోని చెట్లకు వ్యాపించి భారీ కార్చిచ్చుగా మారినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అటవీ శాఖపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో తరచూ వనప్రాంతాల్లో మంటలు చెలరేగుతున్నా, అధికారులు సకాలంలో స్పందించడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అడవులను రక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటు-వంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు హితవులు సూచిస్తున్నారు.

## బెల్లంపల్లిలో పేకాట స్థావరంపై దాడి : ఆరుగురు అరెస్ట్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి రాం నగర్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఏడుగురిపై వన్ టౌన్ పోలీసులు శనివారం దాడి చేశారు. ఈ దాడులలో ఆరుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.1,11,140 నగదు, 52 పేక ముక్కలు, 5 మొబైళ్లు స్వాధీనం చేసుకున్నారు. భూక్యా సాయి అనే వ్యక్తి పరారీలో ఉన్నట్టు ఎస్‌హెచ్ఓ నీలాల దేవయ్య తెలిపారు. పేకాట నిర్వాహకురాలు ఇరవేణి ప్రసన్న ఇంట్లో ఈ ఆట నిర్వహించబడినట్టు వెల్లడించారు. అరెస్ట్ చేసినవారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## తనిఖీల్లో హాష్ ఆయిల్ పట్టివేత

**హైదరాబాద్,ఏప్రిల్12 :**

నగరంలో రాచకొండ పోలీసులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో భారీగా హాష్ అయిల్‌ను పట్టుకున్నారు. హాష్ అయిల్‌ను తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు- భువనగిరి రూరల్ పోలీసులు తెలిపారు. ఇద్దరి వ్యక్తుల దగ్గరి నుంచి హాష్ అయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఒడిస్సా నుంచి హైదరాబాద్‌కు హాష్ అయిల్‌ను వాహనంలో తరలిస్తున్న సమయంలో పట్టుకున్నారు. దీనివిలువ రూ. 80 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

# ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ





- 15 మంది ప్రయాణికులకు గాయాలు
- తీవ్రంగా గాయపడిన బస్సు డ్రైవర్, కండక్టర్
- క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన లారీ డ్రైవర్
- జేసీబీతో బయటకు తీసి దవాఖానకు తరలింపు
- చికిత్స పొందుతూ మృతి

**శెనార్తి మీడియా, నిర్మల్:**

నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండలంలోని తురాటి గ్రామ ఎక్స్‌రోడ్ వద్ద 61వ జాతీయ రహదారి వద్ద శనివారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 15 మంది ప్రయాణికులకు గాయాలు, బస్సు డ్రైవర్ లతీఫ్, కండక్టర్ జంగం సుధారాణికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు లోకేశ్వరం మండలం రాజురా నుంచి నిర్మల్ వెళ్తోంది. నిర్మల్ నుంచి కెమికల్ లోడ్‌తో భైంసా వైపు వెళ్తున్న లారీ ఓవర్‌టేక్ చేసేక్రమంలో ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొంది. ప్రమాద సమయంలో బస్సులో 37 మంది ప్రయాణికులు ఉండగా 15 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో నిర్మల్, భైంసా ఏరియా ఆసుపత్రులకు తరలించారు. లక్ష్మి, భోజవ్వ, గంగవ్వ, రాజేశ్వరి, గణేశ్, సరస్వతి, సజన్ తదితరులు చికిత్స పొందుతున్నారు. లారీ క్యాబిన్‌లో డ్రైవర్ గజ్జల శ్రీను ఇరుక్కుపోయి గంటసేపు నరకయాతన అనుభవించాడు. జేసీబీ సాయంతో బయటకు తీసి 108లో నిర్మల్ ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు లారీ డ్రైవర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల వాసిగా గుర్తించారు. నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ, ఎస్సై సాయికిరణ్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. నిర్మల్ డిపో మేనేజర్ పండరి, ఆర్టీసీ అధికారులతో ఘటన స్థలాన్ని పరిశీలించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇచ్చాం



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్
- చల్మెడ మెడికల్ కళాశాలలో స్నాతకోత్సవం

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్య, వైద్యరంగానికి ప్రాధాన్యమిచ్చామని బీఆర్ఎస్ కార్యని ర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. బొమ్మకల్ లోని చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాలలో శనివారం 2019 సంవత్సరం ఎంబీబీఎస్ బ్యాచ్ విద్యా ర్థుల స్నాతకోత్సవానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రతీ జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలలను మంజూరు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చుతూ వైద్యులుగా మారు తున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో వైద్యులకు ఏఐ చాలెంజ్‌గా మారుతుందని తెలిపారు. చల్మెడ మెడిల్ కళాశాల హైదరాబాద్ కళాశాలలకు దీటుగా వైద్యవిద్యను అందిస్తుండడంతో తన కూతురును ఇక్కడే చేర్పించినట్లు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. కళాశాల చైర్మన్ లక్ష్మీనర్సిం హరావు మాట్లాడుతూ.. తెలంగాణ లో ఏ మెడికల్ కళాశా లలో లేని సిమ్యులేషన్ ల్యాబ్‌ను చల్మెడ వైద్య విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు తెలిపారు. అనంతరం 124మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, కళాశాల డైరెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ ఆసీంఅలీ, వైస్ ప్రిన్సిపాల్ అనిత, సూపరింటెండెంట్ రామకృష్ణప్రసాద్ పాల్గొన్నారు.





## విగ్రహ ఏర్పాటు పనులు త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

ఈ నెల 14వ తేదీన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని విగ్రహం ఏర్పాటు పనులను రేపటిలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐ.బి. చౌరస్తాలో కొనసాగుతున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు మరువలేనివని అన్నారు. ఈ నెల 14 న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని జిల్లాలో వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా విగ్రహ ఏర్పాటు పనులు వేగవంతం చేసి ఈ నెల 14వ తేదీన ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జయంతి వేడుకలలో భాగంగా నిర్వహించే కార్యక్రమాల సంబంధిత పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పని వేళల్లో మార్పులు చేయాలి: ఏఐటీయూసీ



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

వేసవి తీవ్రత నేపథ్యంలో సింగరేణి ఫారెస్ట్ విభాగంలోని పార్కులు, నర్సరీలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పనివేళల్లో మార్పులు చేయాలని ఏఐటీయూసి ఆధ్వర్యంలోని కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. శనివారం జూనియర్ ఫారెస్ట్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు దొడ్డిపట్ల రవీందర్, ఉపాధ్యక్షులు రాచర్ల చంద్రమోహన్ మాట్లాడుతూ... తీవ్ర ఎండల మధ్య కార్మికులు శ్రమించడంతో ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని, వారికి ఉపశమనం కలిగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ, నర్సరీ కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, బ్యాంకు ద్వారా వేతనాల అమలు కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాతిరాజ ప్రభాకర్, బర్ల స్వప్న, కొట్టే లక్ష్మి, జమ్మి లక్ష్మి, గాడిచర్ల స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## ఇనుప రాడ్లు చోరీ చేసిన దొంగల అరెస్ట్




**శెనార్తి మీడియా, మంచిర్యాల**

రామకృష్ణాపూర్ పట్టణంలోని ఓల్డ్ ఏరియా స్టోర్‌లో జరిగిన ఇనుప రాడ్ల దొంగతనంలో సంబంధం ఉన్న ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నీలిమ ఇండస్ట్రీస్ యజమాని చిటుకూరి మల్లేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి శనివారం నిందితులను అరెస్టు చేశారు. ఏరియా దవాఖాన మలుపు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఓ ఆటో ట్రాలీ డ్రైవర్ పారిపోతుండగా పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ట్రాలీలో ఉన్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని పరిశీలించగా, 60 ఇనుప రాడ్లు లభ్యమయ్యాయి. విచారణలో వారు నీలిమ ఇండస్ట్రీస్ నుంచే రాడ్లను దొంగిలించినట్లు ఒప్పుకున్నట్టు పోలీసులు తెలిపారు.ఈ ఆపరేషన్‌లో మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ జంగు, కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## 11 ఏళ్ల తరవాత తల్లిదండ్రుల చెంతకు తనయుడు

మెదక్,ఏప్రిల్12 : 19 ఏళ్ళ వయసులో ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఓ యువకుడు 11 ఏళ్ల తర్వాత తిరిగి తల్లిదండ్రుల చెంతకు చేరాడు. కనిపోయించకుండా పోయిన కుమారుడు తమ చెంతకు చేరడంతో తల్లి దండ్రుల ఆనందానికి హద్దే లేకుండా పోయింది. కుటుంబంలో ఆనందం వెల్లువిరిసింది. 11 ఏళ్ల క్రితం కనిపోయించకుండా పోయిన కుమారుడిని మెదక్ జిల్లా పోలీసులు తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. 2014లో 19 ఏళ్ళు ఉన్నప్పుడు ఇంజనీరింగ్ చదివేటప్పుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు తేజసాయి. 11 ఏళ్లుగా కుమారుడి కోసం తల్లిదండ్రులు శ్రీనివాసరావు, శారద వెతుకుతున్నారు. ఈ నెల ఏప్రిల్ 3న మెదక్ ఎస్పీని కలిసి విషయం తెలియజేశారు తేజసాయి తల్లిదండ్రులు. రంగంలోకి దిగిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో సాయితేజ బెంగళూరులో ఉన్నట్టు- గుర్తించారు. పోలీసులు బెంగళూరు వెళ్లి సాయి తేజని తీసుకువచ్చి క్షేమంగా తల్లిదండ్రులకు అప్పజెప్పారు. బెంగళూరులో పెళ్లి చేసుకుని అక్కడే హోటల్ నడుపుకుంటూ స్థిరపడ్డాడు తేజసాయి. సొంతంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో తల్లితండ్రులను వీడి బెంగళూరు వెళ్లినట్టు తేజసాయి తెలిపాడు. ఇంట్లో నుంచి వెళ్లిపోయి చెడు వ్యసనాలకు, చెడు మార్గాల్లో పయనించకుండా సొంతంగా వ్యాపారం ప్రారంభించి స్థిరపడ్డ తేజసాయిని పోలీసులు అభినందించారు. మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డికి తేజసాయి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**శెనార్తి మీడియా,శంకరపట్నం:** కన్నాపూర్ గ్రామంలో పురాతన ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ చిన్న జయంతి వేడుకలు ఆలయ అర్చకులు మురళి కృష్ణమాచార్యులు వేదమంత్రచనాలతో స్వామివారికి ప్రత్యే క పూజలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాటం వెంకటరమణారెడ్డి సత్యనారాయణ రాజిరెడ్డి రవి భరత్ వినయ్ శ్రీనివాస్ రెడ్డి సునీత, స్వాతి,పద్మ, పాల్గొన్నారు.

